క్లుప్తంగా

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి


మాట్లాడుతున్న జడ్జి తరణి

ఆలూరు రూరల్: ఆరోగ్యమే మహా భాగ్యమని ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి తరణి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కోర్టు ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒత్తిడి జయించేందుకు మానసిక ప్రశాంతత అవసరమన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం, ధ్యానం చేయాలన్నారు. బార్ అండ్ అసోసియేషన్ కార్యదర్శి విజయ్ భాస్కర్ సీనియర్ న్యాయవాది వాయుజీవోత్తమ రావు, ప్రవీణ్, వలి, రంగప్ప వైద్యారోగ్య సిబ్బంది, గ్రామ ప్రజలు ఉన్నారు.

ఉపాధి పనులు కల్పించండి

అస్పరి: తమ గ్రామాలలో ఉపాధి పనులు కల్పించాలని మండలంలోని అట్టికల్లు, ఐనకల్లుకు చెందిన కూలీలు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ కృష్ణమోహన్‌కు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ తమ గ్రామాలలో ఉపాధి పనులు చేపట్టాలంటే అట్టికల్లు సర్పంచ్ లతాశ్రీ గ్రామసభ నిర్వహించి పనులు తీర్మానం చేయాల్సి ఉందన్నారు. సర్పంచ్ పనులకు తీర్మానం చేపట్టక పోవడంతో అధికారులు తమ గ్రామాలలో పనులు చేపట్టడం లేదని అవేదన వ్యక్తం చేశారు. రాజకీయ కారణాలు వల్లే పనులు చేపట్టడం లేదన్నారు. స్పందించిన ఏపీఓ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఉపాధి పనులు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

ధ్యానంతో ఆయురారోగ్యాలు

నందవరం: ప్రతి రోజు ధ్యానం చేయడం ద్వారా ఆయురారోగ్యాలు పొందవచ్చని మహా తపస్వి, హిమాలయ యోగి సదానందగిరి స్వామి అన్నారు. గురువారం నందవరంలోని చౌడేశ్వరి దేవి ఆలయం ప్రాంగణంలో బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ ఆశీస్సులతో పిరమిడ్ ధ్యాన ప్రచారకర్త సత్యాదేవి,, రాజప్పగౌడ్ దంపతుల ఆధ్వర్యంలో ఆత్మవిద్య పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని స్వామిజీ ప్రారంభించారు. గ్రామస్తులకు ధ్యానంపై శిక్షణ ఇచ్చి, అవగాహన కల్పించారు. ఆదోని పిరమిడ్ ధ్యాన కేంద్రం ప్రచారకర్తలు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం

కృష్ణగిరి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో గ్రామీణ ప్రాంతాల్లోని పేదలందరికీ మెరుగైన వైద్యం అందుతుందని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కేశ సుభాషిణి అన్నారు. టి.గోకులపాడు గ్రామంలో గురువారం వారు తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీఓ మోహన్‌కుమార్, వైద్యాధికారులతో కలిసి ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రారంభించారు. నాయకులు ప్రభాకర్ రెడ్డి, మల్లయ్య, తిమ్మరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

పత్తికొండ రూరల్: దేవనబండ గ్రామంలో గురువారం చలివేంద్రాన్ని సర్పంచ్ ప్రవీణ ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. నాయకుడు గాంధిరెడ్డి పాల్గొన్నారు.

ఆరుగురు గైర్హాజరు

నందవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షకు గురువారం ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ సుదర్శన్ రెడ్డి తెలిపారు. మండలంలోని మూడు కేంద్రాలలో పరీక్ష నిర్వహణను ఆయన పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ.. రెండవ రోజు సెకండ్ లాంగ్వేజ్ హిందీ పరీక్ష నిర్వహించామన్నారు. పరీక్షకు 363 మంది విద్యార్థులకు గానూ 357 మంది హాజరైనట్లు తెలిపారు.

ఇద్దరికి గాయాలు

వెల్దుర్తి: చెరుకులపాడు రహదారిలో గురువారం రాత్రి వెల్దుర్తి వైపు వస్తున్న ట్రాక్టర్ ఎదురుగా వచ్చిన బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై నుంచి కిందపడ్డ ఎల్ నగరం కేశాలు, చెరుకులపాడు రాజు గాయపడ్డారు. సమాచారమందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సంక్షేమ లబ్ధిని వివరిద్దాం

కృష్ణగిరి: వైఎస్సార్‌సీపీతోనే పేద కుటుంబాలకు అన్నీ విధాలుగా భరోసా దక్కిందని, ఈ విషయాన్ని ఇంటింటికీ వెళ్లి వివరించాలని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన జెడ్పీటీసీ కేశ సుభాషిణి, నాయకులు ఆర్‌బీ వెంకటరాముడు, లక్ష్మీకాంతరెడ్డితో కలిసి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి 14 రోజులపాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహించేలా సిద్ధం చేసిన కార్యాచరణను వివరించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మద్దికెర: స్థానిక పార్టీ కార్యాలయంలో జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించి మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు, స్టిక్కర్లు విడుదల చేశారు. కార్యక్రమం విజయవతంపై వారికి దిశానిర్దేశం చేశారు.

తుగ్గలి: నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలకు చేసిన మేలును శుక్రవారం నుంచి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిద్దామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జిట్టా నాగేష్‌యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, సర్పంచ్ సురేంద్రనాథరెడ్డి సూచించారు. గురువారం జీఎర్రగుడి, ఉప్పర్లపల్లిలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించి మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహణపై పలు సూచనలు చేశారు.

వేసవి దుక్కులతో ప్రయోజనాలు

- నస్యరక్షణ చర్యలతో క్రిమికీటకాలు నశిస్తాయి
- భూసార పరీక్షలు చేయించు కోవాలంటున్న వ్యవసాయ అధికారులు


మెట్ట పొలంలో దుక్కి దున్నుతున్న రైతు

ఆలూరు రూరల్: పంట కోతల తరువాత మళ్లీ వర్షాకాలంలో వర్షాలు కురిసేంత వరకు నేలను దుక్కి చేయకుండా వదిలేస్తే భూములు నిర్జీవంగా మారుతాయి. వేసవి దుక్కుల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా గుంటుకలు వేయాలని సూచిస్తున్నారు. అలాగే ఆయా గ్రామాల్లోని ఆర్బీకేలలో వ్యవసాయ సహాయకులను సంప్రదించి భూసార పరీక్షలు చేయించుకోవాలని చెబుతున్నారు.

ప్రయోజనాలు ఇలా..

పంటలు లేని వేసవిలో చీడ పురుగులు, తెగుళ్లను కలుగజేసే శిలీంద్రాలు భూమిలో ఆశ్రయిస్తాయి. వేరుశనగ, పప్పు శనగ, మిరప, పత్తి, కంది తదితర పంటలకు ఆశించే పచ్చ పురుగు, లద్దె పురుగులు వంటి భూమిలో ఉంటాయి. వేసవిలో లోతు దుక్కులు వేయడం వల్ల నేలలో ఉన్న చీడ పురుగుల కోశాలు, గుడ్లు బయటపడి వేడికి చనిపోతాయి. కొంగలు, కాకులు మొదలైన పక్షులు వాటిని తిని నాశనం చేస్తాయి. సమగ్ర సస్యరక్షణ పద్ధతుల్లో భాగంగా వేసవిలో లోతు దుక్కులను చేయడంతో పురుగు మందుల వ్యయం తగ్గి వాతావరణ కాలుష్యం తగ్గుతుంది. రబీ పంటలు కోసిన తర్వాత తేమ ఉన్నప్పుడు వాలుకు అడ్డంగా వేసవి దుక్కులు చేయాలి. వర్షాలకు ముందు భూమిని దున్నడం వల్ల తొలకరి వర్షాలు పడగానే నీరు నేలలోకి ఇంకుతుంది. ఈ దుక్కుల వల్ల ఇతర గడ్డిజాతి మొక్క విత్తనాలు కూడా వేసవి ఉష్ణోగ్రతలకు గురై మొలిచే శక్తిని కోల్పోతాయి.

భూసారం పెరుగుతుంది



వేసవి దుక్కుల వల్ల భూమిలో ఉన్న చీడ పురుగుల గుడ్లు బయటి పడి కీటకాలు నశిస్తాయి. వీటి వల్ల పురుగు మందుల వాడకం తగ్గి వాతావరణ కాలుష్యం తగ్గుతుంది. రబీ పంటల కోత తర్వాత వాలుకు అడ్డంగా వేసవి దుక్కులు చేయాలి. తొలకరి వర్షాలు కురిసినప్పుడు భూమిలోకి నీరు ఇంకిపోయి నేల సారవంతం అవుతుంది. ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలి. ఇందుకోసం ఆర్బీకేల్లోని అగ్రికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించాలి.

– సునీత, ఏడీఏ, ఆలూరు

నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు


ఫ్యాక్టరీలో డిస్పోజల్ గ్లాసుల తయారీని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్

ఎమ్మిగనూరుటౌన్: నిషేధిత ప్లాస్టిక్ సామగ్రి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, తహసీల్దార్ జయన్న హెచ్చరించారు. పట్టణంలోని కోసిగి రోడ్డులో అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న ప్లాస్టిక్ ఫ్యాక్టరీలో గురువారం వారు ఆకస్మిక తనిఖీ చేశారు. అనుమతుల్లేకుండా ప్లాస్టిక్ గ్లాసులు తయారీ చేయడం లాంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవని యజమానిని హెచ్చరించి ఫ్యాక్టరీని మూయించారు. ప్లాస్టిక్ నిషేధం దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయని, అందుకు సహకరించాలని కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


దేశాయతండాలో సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీదేవి

తుగ్గలి: అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న గొప్ప ప్రభుత్వం తమదని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం సాయంత్రం జొన్నగిరి సచివాలయం–2 పరిధిలోని దేశాయతండాలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ లబ్ధిని ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని సమస్యలు ఉన్న ఊర్లోనే పరిష్కామవుతున్నాయన్నారు.

అర్హత ఉంటే నేరుగా పథకాలు

గత టీడీపీ హయాంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల దయ, టీడీపీ నాయకుల సిఫార్సు తప్పనిసరి అయ్యేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అర్హత ఉంటే చాలు నేరుగా ప్రజల ముంగిటకే పథకాలు అందుతున్నాయని వివరించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో మేలు జరిగి ఉంటే రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత

పత్తికొండ రూరల్: గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం హోసూరులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి డాక్టర్ ప్రజల ఇళ్ల వద్దకే వచ్చి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వైద్యం అందించే బృహత్తర కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఎంపీపీ నారాయణదాస్, అడిషనల్ డీఎంహెచ్ఓ భాస్కర్, తహసీల్దారు విష్ణుప్రసాద్, ఎంపీడీఓ పార్థసారథి తదితరులు ఉన్నారు.


ఫ్యామిలీ డాక్టర్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మద్దికెర: ఎం.అగ్రహారం గ్రామంలో కొలువైన అవధూత పక్కీరప్ప తాత రథోత్సవాల సందర్భంగా స్వామివారిని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చేసిన మేలును వివరిద్దాం


'జగనన్నే మా భవిష్యత్' కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వివరించి చైతన్యం చేయాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించారు. పట్టణంలోని ఉప్పర ఫంక్షన్ హాల్‌లో గురువారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులతో ఈనెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్న 'జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. కన్వీనర్లకు కార్యక్రమానికి సంబంధించిన కిట్లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ నెల 7వ తేదీ నుంచి ఇంటింటికీ పథకాలు అందుతున్నాయా? లేదా? తెలుసుకొని ప్రభుత్వ పనితీరును వివరించడంతో పాటూ ఇంటి గోడకు స్టిక్కర్లు అంటించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షులు రియాజ్‌అహమ్మద్, వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆదేశించారు. ఆయన గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో అభివృద్ధి కమిటీ సమావేశానికి హాజరయ్యారు. వార్డుల్లో రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రిలో మౌలిక వసతులను కల్పించాలని, సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని, రోగుల వార్డులో మరుగుదొడ్లు శుభ్రంగా ఉండాలని, నీటి సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. సమయపాలన పాటించడంతో పాటు రోగుల పట్ల మర్యాదగా నడుచుకుంటూ వైద్యం అందించాలని పేర్కొన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి, కమిటీ సభ్యులు, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వాస్పత్రిలో వార్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అంగరంగ వైభవంగా రథోత్సవాలు


అశేష జనవాహిని మధ్య గజ్జహళ్లి పోతులింగేశ్వర స్వామి రథోత్సవం


ఎం.అగ్రహారంలో పక్కీరప్ప తాత రథోత్సవం, రామళ్లకోటలో వనం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరుడి మహారథోత్సవం

హొళగుంద: గజ్జహళ్లి గ్రామంలో వెలసిన పోతులింగేశ్వరస్వామి రథోత్సవం గురువారం అత్యంత రమణీయంగా జరిగింది. ఉదయం మూల విరాట్‌కు జలాభిషేకాలు, ఆకుపూజ, మహా మంగళహారతి, నైవేద్య సమర్పణ తదితర పూజలను వేద పండితులు ఘనంగా జరిపారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని రథంలో ప్రతిష్ఠించి అశేష భక్త జనుల మధ్య రథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజేతలకు కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం రూ.15 వేల నగదు, గిరిమల్ల 16 తులాల వెండిని బహుమతిగా అందజేశారు. శుక్రవారం లంకాదహనం, శనివారం వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని గ్రామస్తులు తెలిపారు.

మద్దికెర: ఎం.అగ్రహారం గ్రామంలో అవదూత పక్కీరప్ప స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం స్వామి వారి ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి గ్రామ పురవీధుల గుండా పల్లకోత్సవం నిర్వహించారు. సాయంత్రం భక్తాదులు బోనాలతో ఊరేగింపుగా వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ మూర్తిని రథంలో కొలువుంచి రథోత్సవం నిర్వహించారు. భక్తులు అరటిపళ్లను విసిరి భక్తిని చాటుకున్నారు.

వెల్దుర్తి: రామళ్లకోటలో భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తుల రథోత్సవాన్ని జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన అశేష జనవాహిని కనులారా తిలకించి పులకించారు. గోవింద నామస్మరణ మధ్య భక్తులు ఇనుప గొలుసులను లాగి రథాన్ని ముందుకు కదిలించారు. రథశాల నుంచి మాడవీధిలో 500 మీటర్ల మేర లాగిన అనంతరం తిరిగి రథశాలకు చేర్చారు. రాత్రి స్వామి వారి పారువేట కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం పాలపండ్ల వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించనున్నారు. అలాగే సాయంత్రం రాతిగుండు, చందా ఎత్తు పందెలు, తాడు పందెం, ట్రాక్టర్ రివర్స్, బైక్‌స్లో పందెలు నిర్వహించనున్నారు.

వెల్దుర్తి: గోవర్ధనగిరి సమీపంలో వెలసిన ముక్కంటీశ్వరుని కల్యాణం గురువారం కమనీయంగా జరిగింది. కల్యాణం అనంతరం స్వామి అమ్మవార్లకు నిర్వహించిన రథోత్సవం నిర్వహించారు. కట్టె కోలన్న, చెక్కభజన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పరుగు పందెంలో సిద్దినగట్టు నవీన్ విన్నర్‌గా నిలిచి 5 తులాల వెండి, రన్నర్‌గా నిలిచిన నంద్యాల కిశోర్ 3 తులాల వెండి పతకాలను ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి చేతులమీదుగా అందుకున్నారు. మాటీవీ రేలారే రేలా విజేత, పెద్దకొలుములపల్లె గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన రేలారేరేలా–జబర్దస్త్ జానపద సంగీత విభావరి అలరించాయి. గోపాల్ ఆట, పాటకు తోడు జబర్దస్త్ ఆర్టిస్టులు వినోదిని, అప్పారావు, గడ్డం నవీన్‌లు హాస్య ప్రదర్శనలతో నవ్వులు పూయించారు. శుక్రవారం వసంతోత్సవంతోపాటు రాతిగుండు ఎత్తు పందెం, న్యూ కేటగిరీ వృషభాలకు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి తెలిపారు.

కృష్ణగిరి: తెగదొడ్డి గ్రామ శివారులో వెలసిన లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను ప్రభపై ఉంచి ఊరేగించారు. సాయంత్రం రథోత్సవం నిర్వహించారు. శుక్రవారం పల్లకీసేవ, వసంతోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆలూరు రూరల్: హత్తిబెళగల్‌లో సోమేశ్వర స్వామికి ఆలయ అర్చకులు స్వామి వారికి గంగ పూజ, కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు సోమేశ్వర స్వామి విగ్రహాన్ని మేళతాళాల నడుమ రథంపైకి చేర్చారు. వేలాదిగా తరలివచ్చిన భక్తుల నడుమ ఎదురు బసవన్న గుడి వరకు రథాన్ని లాగారు. భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్న ప్రసాదాలు పంచిపెట్టారు.

నందవరం: నందవరం ప్రజల ఆరాధ్యదైవం పంపాపతి స్వామి మూలవిరాట్‌కు గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, కుంభోత్సవం, నవగ్రహ హోమాలు, శాంతి హోమం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం పూర్ణ కుంభంతో నైవేద్యం సమర్పించారు. చివరగా ఉత్సవమూర్తిని మహారథంపై కొలువుంచి నందికోలు సేవతో, భక్తుల జయ జయ ధ్వానాల మధ్య రథాన్ని నంది మండపం వరకు లాగి నందీశ్వరుడికి పూజలు నిర్వహించి తిరిగి యథాస్థానానికి చేర్చారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. అలాగే గంగవరంలో పంపాపతి జాతర కనుల పండువగా జరిగింది. సాయంత్రం స్వామి వారికి నందికోలు సేవతో ప్రభోత్సవం నిర్వహించారు.

అస్పరి: చిన్నహోతూరులో సిద్ధరామేశ్వర స్వామికి గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు, పార్వతీ, పరమేశ్వరుల పల్లకీ సేవ, సిద్ధ రామేశర స్వామి పాదుకుల ఊరేగింపు, నందికోలు సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు రథాన్ని ఎదురు బసవన్న దేవాలయం వరకు లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. రథం ముందు టెంకాయలు, బాణాసంచా పేల్చుతూ ఉత్సవాన్ని సంతోషంగా జరుపుకున్నారు.

ఆలూరు: గ్రామానికి మూడు కి.మీ దూరంలో ఉన్న బెళ్లగుండ ఆంజనేయస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అలాగే హత్తిబెళగల్‌లో మంత్రాలయం రాఘవేంద్రస్వామి అమృత హస్తాలచేత ప్రతిష్ఠించిన పంత వెంకన్న ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

ఎమ్మిగనూరురూరల్: కడిమెట్లలో లక్ష్మీచెన్నకేశవ స్వామి రథోత్సవం కనులపండువగా జరిగింది. అంతకుముందు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి, నిరూపమ దంపతులు హోమంలో కూర్చున్నారు. అనంతరం భక్తుల హర్షధ్వానాల మధ్య గ్రామ వీధుల్లో రథోత్సవం నిర్వహించారు. ఎంపీపీ కేశన్న, గ్రామ నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


కడిమెట్లలో చెన్నకేశవ స్వామి రథోత్సవం


గోవర్ధనగిరిలో పార్వతీ దేవి, ముక్కంటీశుని రథోత్సవం


తెగదొడ్డిలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి ప్రభోత్సవం


హత్తిబెళగల్‌లో సోమేశ్వర స్వామి రథోత్సవం


నందవరంలో పంపాపతి స్వామి రథోత్సవం


చిన్నహోతూరులో సిద్ధరామేశ్వర స్వామి రథోత్సవం


ఆలూరు బెళ్లగుండ ఆంజనేయస్వామి రథోత్సవం

భూయజమాని అనుమతితోనే సర్వే చేయండి


బుక్కాపురం గ్రామ పరిధిలో రీసర్వేను పరిశీలిస్తున్న కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాద్

వెల్దుర్తి: భూ యజమానులు, రైతులకు నోటీసు ఇచ్చి, వారి అనుమతి తీసుకున్న తర్వాతే రీసర్వే చేపట్టాలని కర్నూలు ఆర్‌డీఓ సి.హరిప్రసాద్ రెవెన్యూ, సర్వే సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని బుక్కాపురం గ్రామంలో ఈనెల 3వ తేదీ నుంచి కొనసాగుతున్న రీసర్వేను గురువారం ఆర్‌డీఓ పరిశీలించారు. జిల్లా సర్వే ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డితో కలిసి సర్వే వివరాలను స్థానిక తహసీల్దార్ రాజేశ్వరి, సర్వేయర్ హేమంత్‌కుమార్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 5,300 ఎకరాలు సర్వే చేయాల్సి ఉండగా 2 రోవర్లు, 5 టీమ్‌లతో సర్వే జరుగుతున్నట్లు తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఎండాకాలం కావడంతో ఉదయాన్నే పనులు ప్రారంభించి, తిరిగి సాయంత్రం కొనసాగించేలా చూసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీయాలని, డ్రాపౌట్లు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్

గోనెగండ్ల: విద్యార్థులు, నిరుద్యోగులు గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో అధికారి గిరిబాబు ఆధ్వర్యంలో 'గ్రంథాలయాల అభివృద్ధి– ప్రజల భాగస్వామ్యం' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ.. గ్రంథాలయ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. గ్రూప్–1, గ్రూప్–2, బ్యాంక్, రైల్వే తదితర పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే ఉద్యోగార్థులకు సంబంధించిన పుస్తకాలన్నీ గ్రంథాలయాల్లో ఉన్నాయని తెలిపారు. ఇంకా ఎలాంటి పుస్తకాలు అవసరమవుతాయో తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే తెప్పిస్తామన్నారు. రానున్న బడ్జెట్‌లో రూ.40 లక్షలతో గోనెగండ్ల గ్రంథాలయానికి నూతన భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. చైర్మన్ చేతులమీదుగా పలువురు గ్రామస్తులు గ్రంథాలయ సభ్యత్వం స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేష్ నాయుడు, మురళి నాయుడు, ఎంపీటీసీ తాయప్ప, ఉసేన్ పటేల్, నాగరాజు, గోవింద్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర


హొళగుందలో ఆంజనేయ స్వామి చిత్ర పటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

హొళగుంద: మండలంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పురవీధుల్లో స్వామి చిత్రపటాన్ని ఊరేగించారు. అన్ని వర్గాల వారు హనుమాన్ మిత్ర మండలి సభ్యులు పాల్గొన్నారు. అలాగే గ్రామానికి 5 కి.మీ దూరంలో వెలసిన అగ్రహార ఆంజనేయ స్వామిని దర్శించుకోవడానికి భక్తులు తరలివచ్చారు. ఆలయంలో ప్రదక్షిణలు, అభిషేకాలు, పవమాన హోమం, మహామంగళహారతి, అలంకారం, ఆకుల అర్చన, రుద్రాభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు.

– సెబ్ ఏఎస్పీ కృష్ణకాంత్ పటేల్, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ నేతృత్వంలో డీఎస్పీ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలతో పాటూ పదుల సంఖ్యలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.